'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

రెలవెన్స్ తెలంగాణానే

'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇక టీఆర్ఎస్‌కు రెలవెన్స్ ఏముంటుంది?'

2014లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, తెలంగాణ వ్యవహారాలు చూసిన దిగ్విజయ్‌సింగ్ చేసిన వ్యాఖ్య ఇది. టీఆర్ఎస్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే పుట్టింది కాబట్టి.. రాష్ట్రమే ఏర్పాటైన తర్వాత ఆ పార్టీ కొనసాగే అవకాశం లేదని, కేసీఆర్ పాత్ర ముగిసిపోయిందని ఆయన వ్యాఖ్యల సారాంశం. అందువల్ల కాంగ్రెస్‌లో టీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవడం లేదా పొత్తు పెట్టుకోవడం అవసరమే లేదని, తెలంగాణ వచ్చింది కాబట్టి టీఆర్ఎస్‌కు భవిష్యత్తే లేదని ఆయన ఆలోచన. కానీ, రాజకీయాలు చాలా డైనమిక్‌గా ఉంటాయి. ఎవరో ఏదో ఊహించుకొని.. సూత్రీకరించుకొని.. దానికి ఏవో నాలుగు ఉదాహరణలు, తమ బుర్రకు తోచిన నాలుగు ఊహాజనిత కల్పనలు తగిలించినంత మాత్రాన అవే నిజాలైపోవు. అవే భవిష్యత్తూ కావు.

దిగ్విజయ్ సింగ్ చెప్పినట్టు తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంతో.. అందుకోసమే పుట్టినప్పటికీ టీఆర్ఎస్ రెలవెన్స్ లేకుండాపోలేదు. కేసీఆర్ ఉనికి మాయమైపోనూ లేదు. కాంగ్రెస్ పార్టీ వాచాలత్వం రాష్ట్ర సాధన దగ్గర ఘనీభవించిపోతే.. రాష్ట్ర పునర్నిర్మాణం అనే సుందర స్వప్నాన్ని కేసీఆర్ ఆవిష్కరించారు. ఆయన రాష్ట్రం సాధించినవాడు కాబట్టి పునర్నిర్మాణం కూడా ఆయనే చేయగలరని ప్రజలు కూడా నమ్మారు. రాష్ట్రం ఎలాగూ ఇచ్చేసింది కాబట్టి అసలు కాంగ్రెస్‌కే రెలవెన్స్ లేదని కూడా ప్రజలు తీర్మానించుకున్నారు. మొత్తంగా దిగ్విజయ్ చెప్పిన రెలవెన్స్ అనే కథ పూర్తిగా మారిపోయి ఎదురు తన్నింది. చాలామంది విద్యావంతులకు రాజకీయాల పదును.. రాజకీయ నాయకుల శక్తి అర్థం కాదు. బహుశా విద్యావంతులమనే అహం తెచ్చిన బలహీనత అది.

ఎస్జీవీ శ్రీనివాసరావు

భారత రాజకీయాల్లో.. ఇక ముగిసిపోయినట్టే అనిపించుకున్న అనేక పార్టీలు, నాయకులు, ఉద్యమాలు భస్మం నుంచి ఫీనిక్స్ పక్షులై లేచిన సందర్భాలు ఎన్నెన్నో ఉన్నాయి. ఎంతోదూరం అక్కర్లేదు. 1969లో నిలిచిపోయి ఆ తర్వాత ఎన్టీఆర్, వైఎస్, చంద్రబాబుల హయాంతో ఆ మాట కూడా వినిపించకుండా 'ఇంకేం తెలంగాణ? శాశ్వతంగా తెరపడింది' అనుకున్న రాష్ట్ర నినాదం, ఉద్యమమై పురుడుపోసుకొని, రాజకీయ ప్రభంజనమై, దేశాన్ని కుదిపేసి ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావంగా సాక్షాత్కారమైన ఉదంతం కండ్లముందే ఉన్నది. అలాగే వందేండ్ల నాటి వివాదం అయోధ్య రామాలయ వివాదం. తాళాలు వేసి మూసేసిన ఆ ప్రాంగణం తిరిగి తెరుచుకుంటుందని నెహ్రూ, ఇందిర హయాంలో ఎవరన్నా ఊహించారా? ఆ ఆలయ నినాదమే దేశ రాజకీయాలను సమూలంగా మార్చివేస్తుందనీ అనుకున్నారా? ఒక కాంగ్రెస్ ప్రధానే స్వయంగా తాళాలు తెరవమని ఆదేశాలు ఇస్తాడనుకున్నారా? ఒక కాంగ్రెస్ ప్రధాని ఉన్నప్పుడే ఆ వివాదాస్పద కట్టడం నేలమట్టం అవుతుందనుకున్నారా? ఆ ఆలయ నినాదం నుంచి పుట్టిన సంఘటనల పర్యవసానంగా ఒక విపక్షం అయోధ్యలో రామాలయం అనే నినాదంతో ఢిల్లీ గద్దెమీద పాతుకుపోతుందనుకున్నారా? సిద్ధాంతీకరణలు.. సూత్రీకరణలు మనకు నచ్చినట్టు మనం చెప్పుకోవచ్చు. కానీ చరిత్ర చాలా గడుసుది. ఎవరి ఊహలకు అందనిది. చరిత్రకు ఆవృతాలు, పునరావృతాలు ఉంటాయి నిజమే. అయితే ప్రతీసారి చరిత్ర పునరావృతం కాదు. నాదెండ్లది, చంద్రబాబుది రెండూ వెన్నుపోట్లే. కానీ, ఒకటి అపజయం పొందితే రెండోది విజయం సాధించింది.

సుద్దులు చాలు..

ఈ మధ్య చాలామంది పాత్రికేయులు బీఆర్ఎస్‌కు సుద్దులు చెప్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలైనా కాలేదు, మూన్నెల్లు కాలేదు. అప్పుడే విమర్శలా? అనేది ఆ సుద్దుల సారాంశం. వాస్తవానికి వారు బీఆర్ఎస్ నాయకులకు సుద్దులు చెప్పడం లేదు. వారి బాగుకోసం కూడా చెప్పడం లేదు. 'చూశారా? బీఆర్ఎస్ నాయకులు పాపం కాంగ్రెస్ ఇలా అధికారంలోకి రాగానే అలా దాడులు చేస్తున్నారు'.. అనే సందేశం ప్రజల్లోకి పంపించేందుకు ప్రయత్నిస్తున్నారు. తమ మీడియా ప్రచారాలతో ప్రజల మెదళ్లను తమ రిమోట్‌లోకి తీసుకొని అలాంటి భావన జొప్పించడానికి చూస్తున్నారు. ఇలాంటి పాత్రికేయులకు ఒక్కటే ప్రశ్న. 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు రుణమాఫీ మీద, కరెంటు సమస్య మీద కాంగ్రెస్, బీజేపీలు ప్రభుత్వానికి సమయమిచ్చే రోడ్ల మీద బీభత్సం సృష్టించాయా? రైతు రుణమాఫీపై ఒక మంత్రి అసంపూర్ణ సమాచారంతో చేసిన ఒక వ్యాఖ్య మీద రహదార్లు దిగ్బంధించి పోలీసుల తలలు పగులగొట్టి నెత్తురు చిందేలా చితకబాదిన ఉదంతం నిజం కాదా? ఆ వార్తలు పతాక శీర్షికలలో తనివితీరా పరిచి శునకానందాలు పొందిన వైనం వాస్తవం కాదా? మరి అప్పుడు ఆ నాయకులకు ఇలాంటి సుద్దులు నీతి బోధలేమైనా చేశారా? అంటే ఒక్క ముక్కా రాసిన పాపాన పోలేదు. మరి ఇప్పుడీ పల్లకీ మోతల రాతలెందుకు?

ఉనికి సమస్యా?

అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ తన ఉనికి కోసం పాకులాడుతున్నదట. దేశ రాజకీయాలు అవగాహన చేసుకున్న రాతలేనా ఇవి. మహారాష్ట్రలో శివసేన వంటి ప్రాంతీయ పార్టీ ఉన్నది. ఎన్సీపీ వంటి సెమీ జాతీయ పార్టీ ఉంది. ఇంకా ఆర్పీఐ, ఎమ్మెన్నెస్ వంటి స్థానిక పార్టీలు, బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలున్నాయి. అక్కడ ఏ ఎన్నికల్లో ఏ పార్టీ ఓటమి ఏ ప్రాంతీయ పార్టీని ఉనికే లేకుండా చేసింది? ఏ ప్రాంతీయ పార్టీ మాయమైపోయింది? ఏ ప్రాంతీయ పార్టీకి పార్లమెంటు ఎన్నికల్లో రెలవెన్స్ లేకుండాపోయింది? బీజేపీ ప్రాంతీయ పార్టీలను లేకుండా చేయాలని చూస్తుందట. ఆ మాటకొస్తే ఏ జాతీయ పార్టీ ప్రాంతీయ పార్టీలను బతుకనిచ్చింది? కాంగ్రెస్ తన 60 ఏండ్ల ప్రస్థానంలో ఎన్ని ప్రాంతీయ పార్టీలను మింగేసింది. అదేమన్నా పత్తిత్తా? పార్లమెంట్ ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రభుత్వాన్ని బీజేపీ అస్థిర పరచకుండా ఉంటుందన్న గ్యారెంటీ ఏమన్నా ఉందా? 2019లో మధ్యప్రదేశ్‌లో అత్తెసరు మెజారిటీతో అధికారం చేపట్టిన కమల్‌నాథ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏడాది తిరిగే సరికి కూల్చివేయలేదా? ఇప్పుడు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అంతకంటే బలంగా ఏమన్నా ఉందా? అంతేనా? ఎన్నెన్ని కుప్పిగంతులు! కాంగ్రెస్ ప్రభుత్వ మనుగడకు ఇబ్బంది లేదట. ప్రభుత్వం కుదురుకున్నదట. ఇక పెరిగేదంతా కాంగ్రెసేనట. తరిగేదంతా బీఆర్ఎస్ అట. అందుకే బీఆర్ఎస్ తన ఉనికి కోసం ప్రకటనలు చేస్తున్నదట. అంతేకాదు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీజేపీ ఇబ్బంది పెట్టదట. త్వరలో ఆ రెండు పార్టీలు మిలాఖత్ ఆరోపణలు వచ్చినా రావచ్చునట. పల్లకీ మోత అర్థమవుతూనే ఉన్నది. సరే.. పల్లకిలో కూర్చున్నవారు క్షేమంగా ఉండాలని బోయీలు కోరుకుంటారు. వారి అవసరం వారిది.

ఎక్కడి శూన్యం? ఎంత దైన్యం?

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు శూన్యమైపోయిందట. ఐదేండ్ల తర్వాత ప్రజలు అధికారమిస్తారా? అనే భయం, అనుమానం వెంటాడుతుందట. ఏం రాతలు? భవిష్యత్తే శూన్యంగా కనిపించేంత దైన్యం బీఆర్ఎస్‌కు లేదు. ఆ పార్టీ భవిష్యత్తును మించే స్థాయి ధైర్యం కాంగ్రెస్‌కూ లేదు. మొత్తం అసెంబ్లీలో 30 శాతం సీట్లు అనేది తక్కువ సంఖ్య కాదు. ఓవరాల్‌గా రాష్ట్రవ్యాప్తంగా రెండు పార్టీల మధ్య తేడా ఏదో అగాధాన్ని పూరించనంత పెద్దదీ కాదు. ఈడ్చికొడితే ఒకటిన్నర నుంచి రెండు శాతం. ఇక ఇతర పార్టీల వల్ల సమస్యా? అంటే అవి తెలంగాణ పుట్టినప్పటి నుంచి ఉన్నాయి. పైగా అనేక ఎన్నికల్లో ఆ రెండు విపక్షాలు కుమ్మక్కై పోటీ కూడా చేశాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో అది నగ్నంగా బయటపడింది కూడా. ఆ రాతలు చూడండి. కాంగ్రెస్ అధికారంలో ఉంది కాబట్టి పార్లమెంటులో ఉండటం దానికి అవసరమట. బీజేపీ ఎలాగూ అధికారంలో ఉంది కాబట్టి (ఎన్నికలే జరుగుతుంటే అధికారంలో ఎక్కడున్నట్టు?) దానికీ అవసర మట. ఎటొచ్చీ ప్రతిపక్షమైన బీఆర్ఎస్ గెలిచి ఏం చేయగలుగుతుందనేది ప్రజల మెదళ్లలోకి జొప్పించదలుచుకున్న సందేశం. అదే నిజమైతే 2019 పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ రెలవెన్స్ ఏమిటి? కేంద్రంలో అధికారం లేదు, రాష్ట్రంలో లేదు. మరి ఎందుకు పోటీ చేసినట్టు? అప్పుడు ఈ రెలవెన్స్ రాతలు రాయలేదేం? అది పక్కకు పెట్టినా వాగ్దానాలు నెరవేర్చకుండా తప్పుదారిన వెళ్తున్న అధికార పార్టీ చెంపలు వాయించి దారిలో పెట్టడానికి పార్లమెంట్ ఎన్నికలు మాత్రం వేదిక కారాదా? బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు వచ్చిన దుబ్బాక తదితర ఉప ఎన్నికల్లో ఏ ప్రాసంగికత ఉందని అధికార పార్టీని ఓడించాలని రాతలు రాశారు. ఓటమిలో పాఠాలుంటాయి. గెలుపులో గుణపాఠాలుంటాయని హరికథలు చెప్పారు?

కౌంటర్ పాయింట్

ప్రాసంగికత ఉంది..

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రాసంగికత, ప్రచారానికి ప్రాతిపదిక ఏమిటంటే కిషన్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేసిన రెండు ప్రకటనలు. ఏమిటట? లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటర్లు ఎందుకు ఓటు వేస్తారు? ఎందుకు వేయాలి? బీఆర్ఎస్ ఇక్కడ అధికారంలో లేదు. మరి గెలిచి ఏం చేయగలుగుతుంది? అసలు ఏ నినాదంతో పోటీ చేస్తుంది? అన్నది ఆ ప్రకటనకర్తల ప్రశ్న. అధికారంలో ఉన్నాయి కాబట్టి బీజేపీ లేదా కాంగ్రెస్ మాత్రమే రాష్ట్ర ప్రయోజనాలు కాపాడుతాయి. మధ్యలో బీఆర్ఎస్ ఏం చేయగలుగుతుంది? అనేది వారి ప్రశ్న. చాలా చిత్రమైన ప్రశ్న. విపరీతమైన ప్రశ్న కూడా!

> **ఈ రాష్ట్రం కోసం పోరాటం చేసిందెవరు? రాష్ట్రాన్ని దేశంలో తలెత్తుకునేలా నిలబెట్టిందెవరు? రేపు ఈ రాష్ట్రానికి ఏదైనా జరగరానిది జరిగితే వీధుల్లోకి వచ్చే దెవరు? బీఆర్ఎస్‌ను మించి ఈ రెండు పార్టల్లో ఏ ఒక్కటైనా నిలబడుతాయా? కలబడుతాయా? అందరికీ తెలుసు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీకి ఉన్న ప్రాసంగికత అదే. బిడ్డకు తల్లికి ఉన్న పేగుబంధమే ఆ ప్రాసంగికత.**

నదుల మళ్లింపు సమస్య..

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తమిళనాట పాగా వేసేందుకు గోదావరి-కావేరీ జలాల అనుసంధానం అంటూ ఓ దుర్మార్గమైన ఎత్తుగడ తీసుకుంటున్నది. నిజమే.. దేశంలో ఉన్న అనేక జీవనదులను అనుసంధానించి పంటపొలాలకు మళ్లించాల్సిన అవసరం ఉన్నది. అయితే దాన్ని గంగా, యమున, బ్రహ్మపుత్ర వంటి భారీ జీవనదులతో ప్రారంభించాలి. వాటిలో సింహభాగం జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయి. ముందు వాటిని వాడుకోవాలి. అదనపు నీళ్లను దక్షిణాదికి కూడా మళ్లించాలి. దాన్ని పక్కనబెట్టి నోరులేని దక్షిణాది రాష్ట్రాల మీద పడి.. అంతంత మాత్రం నీటి లభ్యత.. దానికితోడు అనేక జల వివాదాలున్న గోదావరి-కావేరీ నదుల మీద పడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంకా నీళ్లు రావాల్సిన ప్రాంతాలున్నాయి. స్థిరపరుచుకోవాల్సిన ఆయకట్టు ఉన్నది. ఈ నేపథ్యంలో కేంద్రం దౌర్జన్యంగా నదుల నీళ్లను మళ్లించకుండా పోరాడాల్సి ఉన్నది. ఈ పోరాటం బీజేపీ, కాంగ్రెస్ పార్టీల వల్ల కాదు. బీజేపీ ఎలాగూ కేంద్రంలోనే ఉంది కాబట్టి ఆ పార్టీ వాళ్లు నోరు మెదపరు. ఇక కాంగ్రెస్.. గతంలో ఆ పార్టీ ఏడు మండలాలు ఏపీకి అప్పగించినప్పుడు ఎంత గొప్ప పోరాటాలు చేసిందో.. హైకోర్టు కోసం ఏం చేసిందో చూశాం. ఆ పార్టీల వల్ల తెలంగాణ ప్రయోజనాలు నేరవేరవు. తెలంగాణ కోసం భూమిని, ఆకాశాన్ని ఏకం చేసిన బీఆర్ఎస్‌కు, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు మాత్రమే ఆ శక్తి ఉంది. అందుకే ఈ కీలక సమయంలో లోక్‌సభలో బీఆర్ఎస్ ఎక్కువ స్థానాలు గెలుచుకోవాల్సిన ప్రాసంగికత ఎంతైనా ఉన్నది.

లౌకిక రక్షణ..

మరోవైపు దేశంలో మతతత్వ రాజకీయాలను సమర్థంగా ఎదుర్కోగల లౌకిక శక్తుల అవసరం ఉన్నది.

> **లౌకిక విధానం గురించి కాంగ్రెస్ మాట్లాడితే ప్రజలు నవ్వుతారు. ఓట్ల కోసం బాబ్రీ తాళాలు తీయించిన ఘనత కాంగ్రెస్‌ది. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే బాబ్రీ కూలింది. కశ్మీర్‌ను కెలికికెలికి బ్రహ్మరాక్షసిని చేసింది.. ఖలిస్థాన్ ఉద్యమానికి బీజం వేసింది కాంగ్రెస్సే. దేశమంతా మతతత్వ శక్తులు విచ్చలవిడిగా స్వైరవిహారం చేయడం ఆ పార్టీ పాలన ఫలితమే. ఇక బీజేపీ గురించి చెప్పుకోవాల్సిన అవసరమే లేదు. పెద్ద సంఖ్యలో మైనారిటీ జనాభా ఉన్న తెలంగాణ లౌకిక తను కాపాడేందుకు బీఆర్ఎస్ పార్లమెంటులో ఉండాల్సిన ప్రాసంగికత ఉంది.**

పీఎస్‌యూల కోసం పోరాటం..

ఇక ఆర్థికరంగానికి వస్తే ప్రభుత్వరంగ సంస్థలను విచ్చలవిడిగా బీజేపీ ప్రభుత్వం అమ్మేస్తుంటే దానిమీద కాంగ్రెస్ ఒక నిర్మాణాత్మక ఉద్యమాన్ని నిర్మించడంలో విఫలమైంది. దేశ రాజకీయ చరిత్రలో రాహుల్ వంటి విఫల ప్రతిపక్ష నాయకుడు మరొకరు లేరు. ఈ నేపథ్యంలో లక్షల కోట్ల ప్రభుత్వరంగ సంస్థల ఆస్తుల పరిరక్షణ కోసం తెలంగాణలో ప్రభుత్వరంగ సంస్థలను నిలబెట్టి చూపిన కేసీఆర్ వంటి నాయకులు పార్లమెంటులో ఉండాల్సిన అవసరం ఉంది. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో గొంతెత్తాల్సిన ప్రాసంగికత ఉంది.

ఆ స్క్రిప్టు వెనుక...

ఇవన్నీ వదిలేసి బీఆర్ఎస్ మీద పడటం వెనుక మతలబు ఉన్నది. బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోయినా బలమైన ప్రతిపక్షంగా ఉన్నది. జరిగిన ఒకే ఒక్క అసెంబ్లీ సమావేశంలో బీఆర్ఎస్ విశ్వరూపం ప్రదర్శించింది. దానికితోడు పెద్దగా వ్యవధి లేకుండా కొద్దిరోజుల్లోనే పార్లమెంటు ఎన్నికలు ముంచుకొస్తున్న నేపథ్యంలో ఒక రాజకీయపార్టీగా బీఆర్ఎస్ తన పార్టీని ఎన్నికలకు సన్నద్ధం చేసుకునే క్రమంలో ప్రభుత్వం మీద దాడులు ముమ్మరం చేసింది. ఇది కాంగ్రెస్ పార్టీ కన్నా ఆ పార్టీని మోసే బోయీలకు మింగుడుపడటం లేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు నిలబెట్టుకునే స్థితిలో లేదు. 'దేవుడా! పార్లమెంటు ఎన్నికల కోడ్‌ను త్వరగా ప్రకటించేలా చూడు' అని ప్రభుత్వంలోని పెద్దలంతా వేడుకుంటున్న పరిస్థితి. వాగ్దానాల అమలు జరగలేదు కాబట్టి ఆ ఎన్నికల్లో ప్రజల ఆగ్రహం చవిచూడవచ్చనే భయం వెంటాడుతున్నది. అందుకే ఆలోగా ఓటర్ల దృష్టిలో బీఆర్ఎస్‌కు ఓటేస్తే లాభం లేదనే ప్రచారాలు. 'గెలిపించినా వీళ్ల చేతిలో ఏదీ లేదు కదా?' అనే భావనను బలంగా ప్రజల్లో నాటడం. బీజేపీ ఎలాగూ పెద్దపోటీ కాదు కాబట్టి బీఆర్ఎస్‌ను పక్కకు తప్పిస్తే గండం గడుస్తుందనే వ్యూహం. బీఆర్ఎస్‌ను బలహీన పరచడం, బీఆర్ఎస్ ఓటర్లను దారి మరల్చడం. తద్వారా కాంగ్రెస్ పార్టీకి దారి క్లియర్ చేయడం అనే స్క్రిప్టు ఇప్పుడే ప్రారంభమైంది. మళ్లీ ఇందులో పతివ్రత కథలు. సినిమా అంతా రేపులు చూపించి ఆఖరున రేపులు చేయడం తప్పు, పాపం అంటూ సందేశం ఇచ్చినట్టు.. వేయాల్సిన రాళ్లన్నీ వేసి ఆఖర్లో బీఆర్ఎస్ ఇలా ఉండాలి. అలా ఉండాలి.. ఆ పార్టీ ఉండాల్సిన అవసరం ఉంది అని నీతి సూత్రాలు వల్లించినంత మాత్రాన ఆ ప్రచారాల లక్ష్యం ఏమిటో గమనించలేనంత వెర్రివాళ్లా ప్రజలు?

ఎటమటం



వనవాసమేనా?

'మేము అయోధ్యకు వెళ్లాల్సిన అవసరం లేదు.. మాకు సీఎం సిద్ధరామయ్యనే రాముడంతటివాడు' అని కర్ణాటక మాజీ మంత్రి హెచ్ ఆంజనేయ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. 'శ్రీరామచంద్రున్ని కించపరుస్తారా?' అని బీజేపీ నేతలు కయ్యిన లేచారు. కానీ, ఆ తర్వాత ఆ మాటల వెనుకున్న గూఢార్థాన్ని అర్థం చేసుకున్నాక అంతేగా... అంతేగా అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. లోక్‌సభ ఎన్నికల అనంతరం సిద్ధరామయ్యను గద్దె దించి డీకే శివకుమార్‌ను సీఎం సీట్లో కూర్చోబెట్టడం ఖాయం. అప్పుడు ఎట్లాగూ సిద్ధరామయ్యకు వనవాసమే గతి కదా? అందుకే తమకు సిద్ధరామయ్యే రాముడని మాజీ మంత్రి అని ఉంటారని సెటైర్లు వేస్తున్నారు.

మూన్నాళ్ల ముచ్చటేనా!

ఒక్కనాటి బాగోతంలా తయారైంది మీడియా వాళ్ల పరిస్థితి. సచివాలయంలోకి గత ప్రభుత్వం వెళ్లనీయలేదు. కొత్త ప్రభుత్వం వచ్చాక గేట్లు తెరిచిందని సంబురపడుతూ కొందరు మీడియా ప్రతినిధులు సచివాలయం ముందు నిలబడి సెల్ఫీలు తీసుకొని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో ఆ మరుసటి రోజు నుంచి కొత్త సచివాలయాన్ని చూద్దామన్న కుతూహలంతో పెద్దఎత్తున మీడియా ప్రతినిధులు తరలివస్తున్నారు. అయితే మెయిన్ గేట్ వద్దనే 'ప్రెస్‌కు నో ఎంట్రీ' అని సెక్యూరిటీ సిబ్బంది తేల్చిచెప్తుండటంతో.. మరి మావాళ్లు అలా చెప్తున్నారేంటి? అని అడిగితే, మీకు ఎవరు చెప్పారో వారినే అడగండని దెప్పిపొడుస్తున్నారు.

గ్యారంటీలకు గైడ్‌లైన్స్?

కాంగ్రెస్ సర్కార్ ప్రకటించిన ఆరు గ్యారంటీలకు ఎవరు దరఖాస్తు చేసుకోవాలో, ఎవరు చేసుకోకూడదో స్పష్టత లేక జనం అయోమయంలో పడ్డారు. ఆసరా, రైతుబంధు లబ్ధిదారులు తిరిగి దరఖాస్తు చేసుకోనవసరం లేదని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, మరి రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సబ్సిడీ, మహాలక్ష్మి పథకాలకు ఎవరు అర్హులు, ఎవరు అనర్హులో తెలియడం లేదని ప్రజల్లో సందేహాలు వ్యక్తమయ్యాయి. కానీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి వివరణ లేకపోగా సోషల్ మీడియాలో రోజుకో రకంగా ఆరు గ్యారంటీలకు ఇవే గైడ్‌లైన్స్ అంటూ జరుగుతున్న ప్రచారం ప్రజలను మరింత గందరగోళంలోకి నెట్టేశాయి.

'ఇండియా' జోడో

ఇండియా కూటమిని అధికార పీఠంపై కూర్చోబెట్టే లక్ష్యంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రెండో దశ భారత్ జోడో యాత్ర ప్రారంభించబోతున్నారు. కానీ, ఈ యాత్ర కంటే ముందు 'ఇండియా' జోడో యాత్ర చేపట్టి ఉంటే బాగుండేదని కూటమిలో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఇప్పటికే మధ్యప్రదేశ్ ఎన్నికల సందర్భంగా తలెత్తిన విభేదాల వల్ల సమాజ్‌వాదీ పార్టీకి కాంగ్రెస్‌కు మధ్య పడటం లేదు. అలాగే ఢిల్లీ, పంజాబ్‌లో ఆమ్ ఆద్మీ పార్టీకి కాంగ్రెస్‌కు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండే పరిస్థితి ఏర్పడింది. తాజాగా పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీతోనూ స్థానిక కాంగ్రెస్ నేతలకు పడటం లేదు. ఈ గొడవలన్నీ చూస్తే 'దేశంలో ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీ ఉండేది' అని చెప్పుకొనే పరిస్థితి వస్తుందేమో అని పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఎద్దేవా చేశారు. 'ఇండియా కూటమి' అని ఒకటి ఉండేదని చెప్పుకొనే పరిస్థితి కూడా వస్తుందని ఎన్డీయే నేతలు చురకలేస్తున్నారు.

- వెల్జాల

చూస్తారంతే.. ఓట్లు వేయరు

నెహ్రూ కుటుంబానికి రాహుల్‌గాంధీ వారసుడు. ఆయన ఎప్పుడు, ఎక్కడికి వెళ్లినా చూడటానికి ప్రజలు వస్తారు. ఆయన్ను ఓ హీరోలాగా చూస్తారు. కానీ, ప్రజలు ఆయనకు ఓటు వేయరు.. కాంగ్రెస్‌కు అసలే వేయరు. భారత్ జోడో న్యాయ యాత్ర లాంటివేవీ పని చేయవు. తాజాగా జరిగిన ఎన్నికల్లో ఎటువంటి ఫలితాలు వచ్చాయో చూశాం కదా, అవి వారు ఆశించిన ఫలితాలేనా?

- బద్రుద్దీన్ అజ్మల్, ఏఐయూడీఎఫ్ చీఫ్

అనాథల గోస తీరేనా?

ఐ.ప్రసాదరావు
63056 82733

ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం

> **యుద్ధంలో గెలుపోటములు ఉండవు. ఇరుపక్షాలు భారీగా నష్టపోతాయి. యుద్ధానంతర పరిణామాలను ఊహించలేం. సైనికులతో పాటు ఇరుపక్షాలకు చెందిన వేల మంది అమాయకులు మరణిస్తారు. తాజాగా జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ పోరులో ఇప్పటికే వేల మంది అసువులుబాశారు. ఎందరో చిన్నారులు అనాథలుగా మారారు. ఒక్క ఇజ్రాయెల్-హమాస్ పోరులోనే 22 వేల మందికిపైగా మృతిచెందారు. మరి వారి పిల్లల పరిస్థితేంటి?**

యూనిసెఫ్ ప్రకారం.. యుద్ధాలు, వ్యాధులు, పేదరికం, కరువు, ప్రకృతి విపత్తులు తదితర కారణాల వల్ల తమ తల్లిదండ్రులను కోల్పోయిన 18 ఏండ్లలోపు పిల్లలను అనాథలుగా పరిగణిస్తారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 15.3 కోట్ల మంది అనాథలు ఉన్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. యుద్ధాల కారణంగా అనాథలుగా మారుతున్న చిన్నారుల సంక్షేమం కోసం ఏటా జనవరి 6న ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవాన్ని జరుపుకొంటున్నాం. ఫ్రాన్స్‌కు చెందిన ఎస్ఓఎస్ ఎన్‌ఫాంట్స్ ఎన్ డిట్రెసెస్ సంస్థ దీన్ని ప్రతిపాదించింది.

యుద్ధాల కారణంగా అనాథలుగా మారుతున్న చిన్నారుల గురించి రెండో ప్రపంచ యుద్ధానంతరం అంతర్జాతీయంగా చర్చ మొదలైంది. రెండో ప్రపంచ యుద్ధం వల్ల ఒక్క పోలెండ్‌లోనే 3 లక్షల మంది, యుగోస్లేవియాలో 2 లక్షల మంది అనాథలయ్యారు. ఇజ్రాయెల్ – హమాస్ పోరులో 9 వేల మందికిపైగా చిన్నారులు మరణించడం బాధాకరం. ఇంకా ఎన్ని ప్రాణాలు గాల్లో కలవాలో? ఈ యుద్ధం ఆగేదెన్నడో? ఈ మారణహోమాన్ని నివారించేందుకు అన్ని దేశాలు ముందుకు రావాల్సిన అవసరం ఉన్నది. అనాథల సంక్షేమం కోసం అంతర్జాతీయ, స్వచ్ఛంద సంస్థలు, ప్రపంచ దేశాలు చర్యలు చేపట్టాలి. లేకపోతే ఇటువంటి అనాథలే భవిష్యత్తులో సంఘ విద్రోహ శక్తులుగా మారతారు. 'కుటుంబం లేని పిల్లలు ప్రపంచంలోనే అత్యంత హాని కలిగించే వ్యక్తులు' అని రచయిత బ్రూక్ రాండోల్ఫ్ గతంలో హెచ్చరించిన విషయం విదితమే. ఆధిపత్యం, మతోన్మాదం, జాతి, లింగ, భాషా, ప్రాంతం తదితర కారణాల వల్ల దేశాల మధ్య ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. వాటి వల్ల అనేకమంది అనాథలుగా మారుతూనే ఉన్నారు. పైన పేర్కొన్నట్టు.. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 15.3 కోట్ల మంది అనాథలున్నారు. వీరిలో అత్యధికంగా ఆసియాలో 7.1 కోట్లు, ఆఫ్రికాలో 5.9 కోట్లు, లాటిన్ అమెరికా, కరీబియన్ దీవుల్లో కలిపి 90 లక్షల మంది అనాథలున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి.

పేదరికం, ఉపాధి లేకపోవడం, నిరక్షరాస్యత, కుల, మత, ప్రాంతీయ, లింగ అసమానతల కారణంగా మన దేశంలోనూ లక్షల మంది అనాథలవుతున్నారు. ప్రస్తుతం భారత్‌లో సుమారు 3 కోట్ల మంది అనాథలున్నట్టు తెలుస్తున్నది. వీరిలో ఎక్కువ మంది అక్రమ రవాణాకు గురవుతున్నారు. కొందరు భిక్షాటన చేస్తుండగా.. మరికొందరు దొంగలుగా మారుతున్నారు. విద్య అందకపోవడం, అనారోగ్యం, పోషకాహార లోపం, వసతుల్లేకపోవటం వంటి సమస్యలతో వారు బాధపడుతున్నారు.

అనాథల సంక్షేమం కోసం ప్రతి దేశం పాటుపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలి. ఆర్థిక, సామాజిక అసమానతలను రూపుమాపాలి. విద్య అందరికీ అందేలా చూడాలి. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ప్రపంచ దేశాలు పాలన సాగించి, అనాథలను మంచి పౌరులుగా తీర్చిదిద్దినప్పుడే ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవాన